క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ఎర్రగుంట్ల : ఆర్టీపీపీలోని డీఏవీ స్కూల్‌లో చదువుతున్న జైప్రియ, నేహ అనే విద్యార్థులు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు డీఏవీ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసగుప్తా శనివారం తెలిపారు. ఈ నెల 18వ తేదీన వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌లో జిల్లా స్థాయి వాలీబాల్ ఎస్‌జీఎఫ్ఐ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తమ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారని కొనియాడారు. నవంబర్ 9,10,11 తేదీలలో విజయనగరంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటీ నరేష్ పాల్గొన్నారు.

అనాథ పిల్లలను ఆదరించాలి



పండ్లు పంపిణీ చేస్తున్న జడ్జి ఎస్. భార్గవి

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : సమాజంలో ప్రతి ఒక్కరూ అనాథ పిల్లలను ఆదరించాలని జమ్మలమడుగు జూనియరు సివిల్ కోర్టు జడ్జి ఎస్. భార్గవి అన్నారు. శనివారం రాజా ఫౌండేషన్‌ను జడ్జి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫౌండేషన్‌లో ఉన్న అనాథలు, అభాగ్యులు, వృద్ధులను ఆదరించి వారికి పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. అనంతరం ఫౌండేషన్‌లో అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం అనాథలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్యాం సుందర్‌రెడ్డి, ఫౌండేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యపై ఆర్డీఓ విచారణ

పెండ్లిమర్రి : మండలంలోని ఎనుగువారిపల్లె గ్రామానికి చెందిన వై. చెంద్రాయుడు (61) అనే రైతు ఈ ఏడాది మార్చి నెలలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఆత్మహత్యపై శనివారం కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, వ్యవసాయశాఖ ఇన్‌చార్జి ఏడీఏ సురేష్‌కుమార్‌రెడ్డి విచారణ చేపట్టారు. రైతు ఆత్మహత్యకు గల కారణాలను బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ చల్లనిదొర, తహసీల్దార్ అనురాధ, ఏఓ ఓబులేసు పాల్గొన్నారు.

నీటి సరఫరా

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల మున్సిపల్ పరిధిలోని రెండవ వార్డులోని వినాయకనగర్ కాలనీలో మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. పైపులైన్ పగలిపోయి నీటి సరఫరా ఆగిపోయింది. దీంతో ఈ కాలనీ వాసులు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ వైస్ చైర్మన్ చంద్రకళ, వైఎస్సార్‌సీపీ నాయకుడు వజ్రా డెవిడ్‌లు స్పందించి సమస్యను మున్సిపల్ కమిషనర్ శేషఫణి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కమిషనర్ కాలనీకి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఏపీ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వి. సుబ్బిరెడ్డి హెచ్చరించారు. శనివారం ఆర్టీపీపీ సీఈ గౌరీపతిని కార్మికులతో కలసి వినతిపత్రం అందజేశారు. కార్మికుల సమస్యలపై రెండు రోజులుగా నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశామని అయిన ఏపీ జెన్‌కో యాజమన్యం గానీ, ప్రభుత్వం కానీ స్పందించాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మహాసభలను జయప్రదం చేయండి

వేంపల్లె : యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి చెరుకూరు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పాములూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉపాధ్యాయులతో కలిసి ఆయన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ మహాసభలను నిర్వహిస్తున్నామని, ఈ మహాసభల్లో జిల్లా ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు. ఉపాధ్యాయులు హాజరై సభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కౌన్సిలర్ కృష్ణారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు, హెచ్ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, మేరీ, గుప్తా పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

చింతకొమ్మదిన్నె (వల్లూరు) : పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చునని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి అన్నారు. చింతకొమ్మదిన్నె మండలంలోని పబ్బాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ప్రజారోగ్య కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని అన్నారు. ముఖ్యంగా మునగాకు పొడిని ఆహారంగా తీసుకోవడం వలన ఏ,బీ,సీ,కె విటమిన్లతో బాటు ఐరన్ పుష్కలంగా లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎమ్ సుజాత, గర్భిణులు, కిషోర బాలికలు, బాలింతలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో దొంగలు పడ్డారు!

ప్రస్తుతం సిమెంట్, ఇసుక, కడ్డీలు ఇతర ఇంటి సామగ్రి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ తరుణంలో ఇల్లు కట్టుకోవాలంటేనే పేదలకు కష్టంగా మారింది. అప్పులు చేసి కొద్దికొద్దిగా సామగ్రిని కొంటూ ఇళ్లను నిర్మించుకుంటున్నారు. జగనన్న కాలనీల్లో రాత్రికి రాత్రే ఈ సామగ్రి మాయమవుతుండడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ ధరలకు సామగ్రిని మళ్లీ కొనుగోలు చేసి.. ఇళ్లు కట్టుకునే పరిస్థితుల్లో లేమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు నిఘా ఉంచాలని కోరుతున్నారు.

- రాత్రి వేళల్లో గేట్లు, వాకిళ్లు, కిటికిలు మాయం
- భారీగా నిర్మాణ సామాగ్రి చోరీ
- భద్రత లేక నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులు



గొడను పగుల గొట్టి గేటును అపహరించిన దొంగలు

జమ్మలమడుగు : జగనన్న కాలనీలో దొంగలుపడ్డారు. లబ్ధిదారులు నిర్మించుకున్న ఇళ్లకు సంబంధించిన నిర్మాణ సామగ్రితో పాటు, ఇంటి ముందు ఏర్పాటు చేసుకున్న గేట్లు, కిటికిలను కూడా పెకలించి ఎత్తుకుపోతున్నారు. దీంతో లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టడానికి భయపడుతున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందని ఆశతో నిర్మాణాలు చేపట్టారు. అయితే దొంగలు పగలు రెక్కీ నిర్వహించి రాత్రి వేళల్లో అపహరించుకుపోతున్నారు. ఒక్కటిన్నర సంవత్సరంలో జగనన్న కాలనీలో దాదాపు రూ. 20 లక్షల నుంచి రూ. 25 లక్షల విలువ చేసే వస్తువులు చోరీకి గురయినట్లు తెలుస్తోంది.

2,173 మందికి కేటాయింపు

పట్టణంలోని ఇండ్లులేని నిరుపేదలకు అంబవరం సమీపంలో ఉన్న పాలిటెక్నికల్ కాలేజీ వెనుక ప్రభుత్వ భూములను కేటాయించారు. ఈ ప్రాంతంలో ఇళ్లు లేని నిరుపేదలు మొదట్లో నిర్మాణాలు వేగంగా ప్రారంభించారు. ఇప్పటి వరకు ఈ కాలనీలో 654 మంది నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. మరో 264 మంది లబ్ధిదారులు స్లాబ్ వరకు ,100 మంది బేస్‌మట్టం వరకు నిర్మాణాలు చేపట్టారు. అదేవిధంగా మండల పరిధిలోని మోరగుడి గ్రామ ప్రజలకు పొన్నతోట ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి సమీపంలో స్థలాలు కేటాయించారు. మొత్తం 436 మంది లబ్ధిదారులకు హౌసింగ్‌తో పాటు ఒకటిన్నర సెంటు స్థలాన్ని కేటాయించారు. అందులో 215 మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. మిగిలిన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.

రక్షణ లేక అవస్థలు

లబ్ధిదారులు దొంగల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం హౌసింగ్ నిర్మాణం కోసం లక్షా 80 వేల రూపాయలు అందజేస్తోంది. ప్రభుత్వం సహాయంతో పాటు సంపాదించుకున్న సొమ్ముతో అందమైన ఇంటిని నిర్మించుకునేందుకు శ్రీకారం చుట్టారు. ఇంటి నిర్మాణం కోసం తెచ్చుకున్న కడ్డీలతో పాటు సిమెంట్ బస్తాలు, కిటికిలు, చౌకట్లు రాత్రికి రాత్రే దొంగిలించుకుపోతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా.. విచారిస్తామనే సమాధానం తప్పా ఇప్పటి వరకు దొంగలను పట్టుకున్న దాఖలాలు లేవు. పోలీసులు రక్షణ కల్పించాలని లబ్ధిదారులు వేడుకుంటున్నారు.

ఆగిన నిర్మాణాలు

అంబవరం సమీపంలో ఉన్న జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు ఏడాదిగా ఆగిపోయాయి. అప్పులు తెచ్చి నిర్మాణాలు చేసుకుంటుంటే దొంగలు ఇంటి సామగ్రిని ఎత్తుకుపోతుండటంతో పాటు కాలనీలో ఎలాంటి భద్రత లేకపోవడంతో నిర్మాణాలను పూర్తిగా నిలిపివేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన నీటి వసతికి సంబంధించిన పైపులను కూడా దొంగలు ఎత్తుకెళ్తున్నారు.

దొంగలను కట్టడి చేయాలి



కాలనీలో రాత్రిపూట దొంగలు ఇంటి నిర్మాణం కోసం లబ్ధిదారులు తెచ్చుకున్న సామగ్రిని ఎత్తుకుపోతున్నారు. ఇప్పటికే చాలా చోట్ల దొంగతనాలు జరిగాయి. కాలనీలో ప్రస్తుతం కొంత మంది నివసిస్తున్నారు. నీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. రాత్రిపూట పోలీసులు గస్తీ నిర్వహించి దొంగలను కట్టడి చేయాలి.

వెంకట సుజాత, జగనన్న కాలనీ, అంబవరం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



జగనన్న కాలనీలో తాగునీటి సమస్య ఉందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన సామగ్రి కూడా దొంగలు ఎత్తుకుని పోతున్నారని చెబుతున్నారు. దొంగతనాలు జరుగకుండా పోలీసులకు సాయం తీసుకుంటాం. త్వరలో పూర్తిస్థాయిలో ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు నీటి వసతి ఏర్పాటు చేస్తాం.

వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, జమ్మలమడుగు

22 నుంచి గ్రామసభలు

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధిలోని రచ్చుమరిపల్లె, కనంపల్లె, రాగిమానుపల్లె గ్రామాల్లో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నజీర్ అహ్మద్ తెలిపారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రామ సభలకు రైతులందరూ హాజరై రైతులకు సంబంధించిన రీ సర్వే, సంబంధిత సమస్యలు అధికారుల వద్దకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గండి నిత్యాన్నదానానికి రూ.లక్ష వితరణ



విరాళాలన్ని అందజేస్తున్న శ్రీనివాసులు దంపతులు

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి శనివారం రూ.1,00,516 విరాళంగా వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య తెలిపారు. వేంపల్లె, పుల్లయ్య తోటకు చెందిన చెల్లుబోయిన శ్రీనివాసులు, మల్లమ్మ దంపతులు విరాళం ఇచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ మర్యాదలతో సత్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకుడు రాజారమేష్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు

కమలాపురం : భూ సమస్యల పరిష్కారం కోసమే భూ రీసర్వే చేపట్టినట్లు మండల తహసీల్దార్ శివరామిరెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని గంగవరం సచివాలయంలో రెవెన్యూ సదస్సు–గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూ సమస్యలున్న రైతులు ఇచ్చిన అర్జీలను పరిష్కరించేందుకే ఈ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. విస్తీర్ణంలో సమస్యలున్నా, సర్వే నెంబర్లలో ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కాగా గంగవరం, విభరాపురం గ్రామాలకు చెందిన రైతుల నుంచి వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. వాటిని పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్వే డీటీ శ్రీకాంత్, మండల సర్వేయర్ సురేంద్రనాథ్ రెడ్డి, వీఆర్ఓ, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు–గ్రామ సభల షెడ్యూలు

కమలాపురం మండలంలోని భూ రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లో రెవెన్యూ సదస్సు–గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శివరామిరెడ్డి తెలిపారు. 19 గంగవరంలో సభ నిర్వహించామన్నారు. 22న సి.గోపులాపురం, 23, 24న పాచికలపాడు, 25న పందిళ్లపల్లె, 26, 29న నల్లింగాయపల్లె, 30న గొల్లపల్లె, నవంబర్ 1న రామచంద్రాపురం, 2న పెద్దచెప్పలి, 5న దేవరాజుపల్లె, 6న దాదిరెడ్డిపల్లె, 7న వంకమాడ, 8న జంభాపురం, 12న తురకపల్లె, 13, 14న లేటపల్లె, 15న పొడదుర్తి గ్రామాలలో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు.



చింతకొమ్మదిన్నె(వల్లూరు): రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ నాగేశ్వరరావు

చింతకొమ్మదిన్నె(వల్లూరు) : భూ సమస్యల పరిష్కారం కోసమే భూ రీసర్వే చేపడుతున్నామని మండల తహసీల్దార్ నాగేశ్వరరావు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని అప్పరాజుపల్లె గ్రామంలో సోమవారం జరిగిన గ్రామ సభలో తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వే జరిగిన భూములకు సంభందించి అడంగల్ ఎంట్రీలో పొరపాట్లు, కొలతలు, విస్తీర్ణంలో తేడాలు ఉన్న భూములు మొదలైన సమస్యలను గ్రామసభల్లో పరిష్కరించుకోవాలని కోరారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సాంకేతిక విద్యతోనే ఉపాధి అవకాశాలు

వేంపల్లె : సాంకేతిక విద్య ద్వారా ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని తహసీల్దార్ హరినాథ్ రెడ్డి, ఐటిఐ ప్రిన్సిపాల్ ప్రసాదరావు, సీఐ సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక కందుల ఓబుల్‌రెడ్డి చారిటీస్ ఐటిఐలో విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐటిఐ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు పరిశ్రమలు, ఉత్పాదక తయారీ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. సాంకేతిక పోస్టులలో సింహభాగం సంబంధిత ట్రేడ్‌లలో ఐటిఐ చదువుతున్న వారితోనే భర్తీ చేస్తున్నారని తెలిపారు. అనంతరం సీఐ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. చక్రాయపేట ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నాగభూషణరెడ్డి, ఐటిఐ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సీఐ, తహసీల్దార్, ప్రిన్సిపాల్ తదితరులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పులివెందుల రూరల్ : పులివెందుల అర్బన్ పరిధిలోని నగరిగుట్టలో జిల్లా మలేరియా అధికారి మనోరమ ఆధ్వర్యంలో శనివారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పర్యటించారు. ప్రజలకు దోమకాటువల్ల వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించి ఆశా కార్యకర్తలు నిర్వహిస్తున్న లార్వా సర్వేను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి మనోరమ మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారికి రక్తపూతలను సేకరించి వారానికి రెండు సార్లు ల్యాబ్‌కు అందజేయాలని, ఎవరికైనా మలేరియా నిర్ధారణ అయితే వెంటనే చికిత్స అందించాలన్నారు. పులివెందుల ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాజా మొద్దీన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఫ్రైడే – డ్రైడే నిర్వహించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమకాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ఎస్‌పీఎం డాక్టర్ కేశవ, జిల్లా ఎపిడెమియాలజిస్ట్ ఖాజా మొద్దీన్, డాక్టర్ స్నేహ, డాక్టర్ శాంత కుమార్, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ లక్ష్మీ కళ్యాణి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



నగరిగుట్ట పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి మనోరమ

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

పులివెందుల రూరల్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నగరిగుట్ట పీహెచ్‌సీ డాక్టర్ స్నేహ ప్రతిక్ష అన్నారు. పట్టణంలోని స్థానిక నగరిగుట్టలోని పీహెచ్‌సీలో ఆమె శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజన్ వ్యాధులు మలేరియా, డెంగీ, టైఫాయిడ్, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులు సంప్రదించి సరైన చికిత్స తీసుకోవాలని పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

విద్యుత్ ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటు

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురంలో శనివారం విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ ప్రీపెయిడ్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీ మోటార్లు, వీధి దీపాలకు బిగిస్తున్నారు. త్వరలో అన్ని రకాల విద్యుత్ కనెక్షన్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లను అమర్చనున్నారు.

ముగిసిన శిక్షణా తరగతులు

లింగాల : లింగాల ఎంపీడీఓ కార్యాలయంలో రెండవ రోజు పంచాయతీ సర్పంచ్‌లకు, ఉప సర్పంచ్‌లకు, వార్డు మెంబర్లకు శనివారం శిక్షణా తరగతులు నిర్వహించారు. దీంతో రెండు రోజుల శిక్షణ ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ప్రజలకు తాగునీరు, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ లోకేశ్వర రావు, ఈఓపీఆర్డీ ఫ్లోరెన్స్ పేటీ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : మండల పరిషత్ కార్యాలయంలో ఉపసర్పంచ్‌లకు వార్డు సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకటరమణయ్య మాట్లాడుతూ గ్రామ పంచాయతీ విధివిధానాలపై ఉప సర్పంచ్‌లకు, సభ్యులకు వివరించామని తెలిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చాయని పేర్కొన్నారు. ఈఓపీఆర్డీ రహమతులయ్యతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

కర్ణపాపాయపల్లెలో పల్లె పండుగ

లింగాల : లింగాల మండలం కర్ణపాపాయపల్లె గ్రామంలో శనివారం అధికారులు పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ మెటీరియల్ కంపోనెంట్స్ కింద మంజూరైన రూ.6.80 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ ఏపీఓ గంగరాజు, హౌసింగ్ ఏఈ రామసూరారెడ్డి, పంచాయతీ రాజ్ అధికారులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

చింతకొమ్మదిన్నె (వల్లూరు): మండల పరిధిలోని పెద్దకాంపల్లె, పాపాసాహెబ్ పేట గ్రామ పంచాయతీల్లో శనివారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీడీఓ కుళాయి బాబు శంకుస్థాపన చేశారు.

వైఎస్సార్‌సీపీదే నైతిక విజయం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి. నరేన్ రామాంజులరెడ్డి



వల్లూరు : ఇసుకపై జీఎస్టీ రద్దు చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడం వైఎస్సార్‌సీపీదే నైతిక విజయమని ఆ పార్టీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పి. నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఉచితంగా ఇసుకను ఇస్తామని చెప్పిన కూటమి నేతలు అందుకు విరుద్ధంగా సీనరేజీ, జీఎస్టీ, రవాణా చార్జీలు ఇలా రకరకాల చార్జీల పేరుతో ప్రజల నుంచి భారీ మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇదే విషయంపై తాను జెడ్పీ సమావేశంలో ప్రశ్నించామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నేతలు కూడా పలు సందర్భాల్లో ప్రశ్నిస్తూ వచ్చారని పేర్కొన్నారు.

ప్రజలపై ప్రేమతో కాదు..

ఇసుక ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో రాష్ట్రంలో నిర్మాణ రంగం చతికిలబడిందని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరువైందని ఇప్పటికైనా సీఎం గుర్తించారని నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. ఇసుకపై జీఎస్టీ, సీనరేజీని రద్దు చేయడం వలన నిర్మాణ రంగం వేగవంతమవుతుందని, తద్వారా నిర్మాణ సామగ్రి, ఇతర వస్తువుల కొనుగోళ్లు పెరిగి ప్రభుత్వం సీనరేజీ రూపంలో కోల్పోయిన ఆదాయం కంటే ఎక్కువ ఆదాయం వస్తుందని చంద్రబాబు ప్రకటించడం చూస్తుంటే.. ఆయనకు ప్రజలపై ప్రేమ కంటే ఆదాయమే ముఖ్యంగా కనిపిస్తోందని విమర్శించారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి

పులివెందుల రూరల్ : అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో ఆయన మాట్లాడుతూ పులివెందుల డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ముఖ్యంగా మట్కా, జూదం లాంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించినా, జరిపినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొన్ని ప్రాంతాలలో ఆన్‌లైన్ మట్కా నిర్వహిస్తున్నారని, వారిపైన కూడా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. మట్కా మహమ్మారిని తరిమికొట్టేందుకు చట్టపరమైన అన్ని చర్యలు తీసుకొని ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అలాగే పులివెందుల ప్రాంతంలో చోరీలు జరగకుండా ప్రత్యేక పోలీస్ బృందాలు ఏర్పాటు చేసి గస్తీ నిర్వహిస్తున్నామని తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కమలాపురం : ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, కడప డీఎస్పీ పర్యవేక్షణలో శనివారం కమలాపురం పట్టణంలోని క్రాస్ రోడ్డు, సబ్‌జైలు, పాత ఎస్‌బీఐ, సంబటూరు బస్టాండు వద్ద సైబర్ నేరాలు, పోలీస్ హెల్ప్ లైన్, మహిళల సమస్యల పరిష్కారం, ర్యాగింగ్, గంజాయి పట్ల అవగాహన కల్పించే బ్యానర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు ఎలాంటి సమస్యలున్నా 112కు డయల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరగాళ్లతో మోసపోయిన వారు 1930కు, అవినీతి జరిగితే 14,400కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎవరైనా ఫోన్ చేసి బ్యాంక్ అకౌంట్, పిన్ నంబర్లు తదితర వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

వేముల : తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఉద్యాన పంటలు దెబ్బతినకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అరటి పరిశోధనా స్థానం శాస్త్రవేత్త సునీల్ కుమార్, హెచ్ఓ రాఘవేంద్రారెడ్డి రైతులకు సూచించారు. శనివారం వేములలో వర్షాలతో దెబ్బతిన్న అరటి, ఉల్లి పంటలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలతో సోకే తెగుళ్లను సకాలంలో నివారించకపోతే పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని, రైతులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. అధిక వర్షాల తర్వాత ఉద్యాన పంటలైన అరటి, ఉల్లి పంటలలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు.

సస్యరక్షణ చర్యలపై అవగాహన

వర్షాలతో తెగుళ్లు సోకి అరటి గెలలు వేయని తోటలలో క్లోరోఫాలోనిల్ 2 గ్రాములు లీటరు నీటితోనూ లేదా ప్రాఫికోనోజోల్ ఒక ఎంఎల్ లీటరు నీటిలో పిచికారీ చేయాలన్నారు. ఈ మందులలో మార్చి మార్చి పిచికారీ చేయాలని సూచించారు. వీటితో పాటు హార్టికల్చర్ మినరల్ ఆయిల్ 10ఎం.ఎల్ లీటరు నీటితో పిచికారీ చేయాలని పేర్కొన్నారు. ఉల్లి పంటలో మజ్జిగ తెగులు సోకినట్లయితే టేపుకోనోజోల్ 1ఎం.ఎల్ లీటరు నీటికి పిచికారీ చేయాలన్నారు. రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏలు హారిక, నందిని, రైతులు పాల్గొన్నారు.



అరటి పంటలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు వివరిస్తున్న శాస్త్రవేత్త, అధికారులు

ప్రేమోన్మాది దాడిలో గాయపడిన విద్యార్థినికి అండ

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా
- రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలికి పరామర్శ



బాధితురాలిని పరామర్శిస్తున్న జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ప్రేమోన్మాది దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న విద్యార్థినికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. పెట్రోల్ పోసి నిప్పంటించడం వల్ల తీవ్ర గాయాలతో రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలిని శనివారం రాత్రి వారు పరామర్శించారు. అమ్మాయి కుటుంబ సభ్యులతో మాట్లాడి సంఘటన వివరాలు తెలుసుకున్నారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనర్ బాలికపై అత్యాచారం చేసి, హత్య చేయాలనుకోవడం బాధాకరమన్నారు. ఈ ఘటనలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కఠిన శిక్ష పడాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలకు దిశ చట్టం ద్వారా రక్షణ కల్పించామన్నారు. కనీసం బాధితురాలిని పరామర్శించేందుకు కూడా కూటమి నేతలకు మనసు రాకపోవడం విచారకరమన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, ఈ ఘటనకు హోంమంత్రి అనిత బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బద్వేల్‌లో జరిగిన దారుణ ఘటనపై, రాష్ట్రంలోని పరిస్థితులపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు పులి సునీల్ కుమార్, తోటక్రిష్ణ, దత్తసాయి పాల్గొన్నారు.